సాక్షి
తిరుపతి
శనివారం । 16 । ఆగస్టు । 2025



మార్మోగిన రామగిరి

రామగిరి ముత్తుకుమారస్వామి ఆలయం శుక్రవారం హరోం హర నామస్మరణలతో మారుమోగింది. - 8లో



ఎమ్మెల్సీ మేరిగకు పరామర్శ

ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తండ్రి ఆనందరావు మృతి చెందడంతో పలువురు నేతలు ఆయన్ని పరామర్శించారు. - 8లో



వివాహ పరిచయ వేదిక రేపు

తిరుపతిలో ఈ నెల 17వ తేదీన వివాహ పరిచయ వేదిక జరగనున్నట్టు ఆ సంఘం అధ్యక్షుడు సుబ్రమణ్యం తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

బోసిపోయిన కళాశాలలు

తిరుపతి సిటీ: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలు విద్యార్థుల సంఖ్య ఆశించిన స్థాయిలో లేకపోవడంతో స్వాతంత్ర్య దిన వేడుకలు చెప్పుకోదగ్గ రీతిలో ఆకట్టుకున్నట్లు కనిపించలేదని అధ్యాపకులు చర్చించుకోవడం గమనార్హం. వరుసగా మూడు రోజుల సెలవులు రావడంతో హాస్టల్ విద్యార్థులు తమ స్వస్థలాలకు వెళ్లారు. దీంతోపాటు డిగ్రీ, పీజీ మొదటి ఏడాది కోర్సుల్లో ప్రవేశాలు చేపట్టకపోవడం మరో కారణమని తెలుస్తోంది. అన్ని కళాశాలలోనూ కేవలం ఎన్‌సీసీ క్యాడెట్లతోనే స్వాతంత్ర్య వేడుకలు తూతూ మంత్రంగా జరుపుకోవడం విశేషం.

అవయవదానం



గంగన్ (ఫైల్)

నాగలాపురం: మండలంలోని వినోభానగర్ గ్రామానికి చెందిన గంగన్(55) శుక్రవారం బ్రెయిన్ డెడ్ అయినట్లు చెన్నై ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు నిర్ధారించారు. దీంతో మృతుని అవయవాలను దానం చేయడానికి అతని భార్య మంజుల అంగీకారం తెలిపింది. దీంతో వైద్యులు రెండు కిడ్నీలు, ఓ ఎముకను ఆపరేషన్ చేసి, తీసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

15వ జాతీయ హాకీ పోటీలకు గూడూరు విద్యార్థి



యశ్వంత్

చిల్లకూరు: గూడూరు పట్టణం చర్చివీధికి చెందిన దేవతా యశ్వంత్ అనే ఇంటర్ విద్యార్థి 15వ జాతీయ స్థాయి జూనియర్ హాకీ పోటీలకు ఎంపికైనట్లు హాకీ కోచ్ ఆకాష్‌దీపక్ శుక్రవారం తెలిపారు. ఈ క్రీడాకారుడు పంజాబ్ రాష్ట్రంలోని జలందర్‌లో ఈ నెల 12 నుంచి 22వ తేదీ వరకు జరిగే జూనియర్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్ర జట్టులో సభ్యుడిగా పాల్గొంటారని కోచ్ తెలిపారు. ఈ నెల 18న జరిగే పోటీలో పాల్గొంటున్నట్లు తెలిపారు. విద్యార్థి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో శ్రీలక్ష్మి చారిబుల్‌ట్రస్టు నిర్వాహకులు శ్రీలక్ష్మి, పీఎంరావు తమవంతు ఆర్థిక సహకారం అందించారు. ఇతడి ఎంపికపై హాకీ అసోసియేషన్ తిరుపతి అధ్యక్షుడు టీ స్వర్ణన్‌రాజు తదితరులు అభినందనలు తెలిపారు.


విచ్చలవిడిగా మద్యం.. మాంసం విక్రయాలు



కరకంబాడిలోని దుకాణంలో కొనసాగుతున్న చికెన్ విక్రయం

రేణిగుంట: మండలంలో స్వాతంత్ర్య దినోత్సవం రోజున మద్యం, మాంసం విక్రయాలు యథేచ్ఛగా సాగాయి. మందు బాటిల్‌పై రూ.50 అధికంగా వసూలు చేస్తూ తమ వ్యాపారం కొనసాగించారు. కరకంబాడిలో ప్రధాన రహదారిపైనే చికెన్ దుకాణాలు తెరిచి అధిక ధరతో అమ్మకాలు కొనసాగిస్తున్నారు. అరికట్టాల్సిన ఎక్సైజ్ శాఖ, పంచాయతీ, పోలీస్‌శాఖ అధికారులు మాత్రం మాకు ఎటువంటి సంబంధం లేదనేలా వ్యవహరించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండాయి. క్యూ శిలాతోరణం వద్దకు చేరింది. గురువారం అర్ధరాత్రి వరకు 66,530 మంది స్వామివారిని దర్శించుకోగా 32,478 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.66 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించబోరని స్పష్టం చేసింది.

మది నిండా.. తిరంగ జెండా

ఆశ..ధ్యాస..శ్వాస..స్వాతంత్ర్యమే లక్ష్యంగా నిరంతర పోరాటం చేసిన సమరయోధులకు తిరునగరిలో అధికారులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. నాడు మీరు చేసిన పోరాట ఫలితమే నేడు మేము స్వేచ్ఛాజీవితం ఆనందంగా గడుపుతున్నామని గుర్తు చేసుకుంటూ వారి త్యాగాలను స్మరించుకున్నారు. తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ తారక రామా స్టేడియంలో స్వాతంత్ర్య దిన వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన పోలీసు కవాతు.. సర్కారు సంక్షేమ పథకాల శకటాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రదర్శనలు అబ్బుర పరిచాయి. దీంతో మది..మది నిండా తిరంగ జెండా నిండింది.

- జిల్లాలో ఉప్పొంగిన దేశభక్తి
- వేడుకగా 79వ స్వాతంత్ర్య దినోత్సవం
- 391 మందికి ప్రశంసాపత్రాలు ప్రదానం
- శకటాలు, స్టాళ్లకు బహుమతులు
- ఆకట్టుకున్న పోలీస్ జాగిలం విన్యాసాలు
- ఏర్పాట్లు ఘనం.. హాజరుకాని నగర జనం



జెండాను ఆవిష్కరిస్తున్న దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్, ఎస్పీలు



జెండా వందనం చేస్తున్న టీటీడీ చైర్మన్, ఈఓ, జేఈఓ



కుమార్తెతో మిఠాయిలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్



గౌరవవందనం చేస్తున్న పోలీసులు



తిరుపతి ఐఐటీలో జెండా ఎగురవేసి మాట్లాడుతున్న ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ



కవాతు చేస్తున్న ఐసర్ డైరెక్టర్ ప్రొఫెసర్ శాంతను భట్టాచార్య, రిజిస్ట్రార్ ఇంద్రప్రీత్ సింగ్ కోహ్లీ

తిరుపతి అర్బన్/తిరుపతి క్రైమ్/తిరుపతి సిటీ: తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ తారకరామా స్టేడియంలో 79వ స్వాతంత్ర్య దిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పాల్గొని, జిల్లాను ప్రగతి పథంలో జిల్లాను నడిపిద్దామని పేర్కొన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో స్వాతంత్ర్య దిన సంబరాలు జరుపుకున్నారు. శుక్రవారం ఊరువాడా తేడా లేకుండా జెండా ఎగురవేసి వందనం సమర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుల స్మృతులను ఒకసారి అంతా నెమరువేసుకున్నారు. తిరుపతి తారకరామా స్టేడియంలో నిర్వహించిన జిల్లా కార్యక్రమానికి మంత్రి ఆనం రామనారాయణరెడ్డితోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

391 మందికి ప్రశంసాపత్రాలు ప్రదానం

తిరుపతిలో జరిగిన వేడుకల్లో మంత్రి ఆనం ముఖ్య అతిథిగా పాల్గొని జెండాను ఎగురవేసి, వందనం చేశారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. తర్వాత శాంతి కపోతాలను ఎగురవేశారు. తరువాత 24 పేజీల జిల్లా ప్రగతిని చదివి వినిపించారు. తర్వాత పోలీస్ జాగిలాలతో చేయించిన పలు విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రతిభ చూపిన అధికారులకు శాఖల వారీగా 391 మందికి ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తి, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్‌రెడ్డి, హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ హరిప్రసాద్, రజక కార్పొరేషన్ చైర్మన్ చంద్ర, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారి, పరిశ్రమలు, మౌలికవసరుల కల్పన డైరెక్టర్ శ్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు ఘనం..హాజరుకాని నగర జనం

తారకరామా స్టేడియంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అయితే ఏటా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించేవారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితోపాటు అవార్డులు తీసుకునేవారు వారి బంధువులే కాకుండా తిరుపతి నగర వాసులు జిల్లా కార్యక్రమాన్ని తిలకించడానికి పెద్ద ఎత్తున వచ్చేవారు. అయితే ఈ ఏడాది వర్షం నేపథ్యంలో తారకరామా స్టేడియంలో నిర్వహించారు. అవార్డులు తీసుకునే వారు వారి బంధువులు మినహా నగర వాసులు ఎవరూ హాజరుకాలేదు. ఎక్కడ నిర్వహిస్తున్నారనే అంశంపై ముందస్తుగా స్పష్టమైన సమాచారం లేకపోవడంతోనే నగరవాసులు రాలేదని చర్చసాగుతుంది.

ఎస్పీడీసీఎల్‌లో..

తిరుపతి రూరల్: ఏపీ ఎస్పీడీసీఎల్‌లో స్వాతంత్ర్య దిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందజేశారు.

సాంకేతిక పరంగా భారత్ గ్లోబల్ మ్యాప్‌లోకి..



షార్‌లో మువ్వన్నెల జాతీయజెండాను ఎగురవేస్తున్న షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చేస్తున్న ప్రయోగాల పరంపరతో దేశంలో ప్రతి ఒక్కరికీ అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చి నేడు గ్లోబల్ మ్యాప్‌లో భారత్‌కు ఒక ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చామని షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ పేర్కొన్నారు. షార్‌లోని స్పేస్ సెంట్రల్ స్కూల్ మైదానంలో 79వ స్వాతంత్ర్య దిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ మన జాతీయజెండా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి వందనం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐఎస్ఎఫ్ కమాండెంట్ సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో భద్రతా దళాలు గౌరవ వందనం సమర్పించారు.



స్వాతంత్ర్య దినోత్సవంలో మాట్లాడుతున్న సీఎండీ సంతోషరావు

జైకిసాన్, జైజవాన్ అంటూ నినదించిన రైతన్న

చిట్టమూరు: స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జనం తమ అభిరుచుల మేరకు దేశభక్తిని చాటుకోగా ఓ రైతన్న తనదైన శైలిలో దేశభక్తిని ప్రదర్శించాడు. చిట్టమూరు మండలం సోమసముద్రం గ్రామానికి చెందిన కృష్ణయ్య అనే రైతు త్రివర్ణ పతాకాన్ని కాడెద్దుల బండితో పాటుగా ఎద్దులకు కట్టి దేశభక్తిని చాటుకున్నాడు. చూసిన వారు ఇలా ఉండాలని అనడం వినిపించింది.



చిట్టమూరు: కాడెద్దుల బండిలో వెళుతున్న రైతన్న

ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యప్రదర్శనలు

తొమ్మిది పాఠశాలలకు చెందిన విద్యార్థులతో తొమ్మిది పాటలకు చేపట్టిన నృత్యప్రదర్శనలు అలరించాయి. అలాగే శాఖల వారీగా ఏర్పాటు చేసిన 9 అభివృద్ధి శకటాల ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. నృత్య ప్రదర్శనలో మొదటి బహుమతి జెండా విశిష్టతపై జై జవాన్ జై కిసాన్ గురించి నృత్య ప్రదర్శన చేసినందుకు చంద్రగిరిలోని అక్షర్ దామ్ స్కూల్ విద్యార్థులు, రెండో బహుమతి ఎస్‌జీఎస్ స్కూల్ తిరుపతి విద్యార్థులు, మూడో బహుమతి ఏర్పేడులోని ఎస్ఓఎస్ స్కూల్ విద్యార్థులకు అందించారు. పరిశ్రమలు - ఏపీఐఐసీ, వ్యవసాయం, ఉద్యానవనం - ఏపీఎంఐపీ, డీఆర్‌డీఏ - మెప్మా, పురపాలక సంస్థ, పర్యాటకం, అగ్నిమాపక శాఖ, విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ శకటాలు కనువిందు చేశాయి. అందులో తిరుపతి నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన శకటానికి మొదటి బహుమతి, డీఆర్‌డీఏ మెప్మా సంయుక్తంగా ప్రదర్శించిన శకటానికి రెండో బహుమతి, వ్యవసాయశాఖ ప్రదర్శించిన శకటానికి మూడో బహుమతి లభించింది. జిల్లా పంచాయతీ, ఏపీఎస్పీడీసీఎల్ శాఖల ఆధ్వర్యంలో ప్రదర్శించిన స్వర్ణనారావారి పల్లె శకటానికి స్పెషల్ జ్యూరీ అవార్డును అందించారు. అలాగే శాఖలవారీగా 10 స్టాళ్లను ఏర్పాటు చేశారు. అందులో పశుసంవర్థకశాఖ వారు ఏర్పాటు చేసిన స్టాల్‌కు ప్రథమ బహుమతి, డ్వామా వారు ఏర్పాటు చేసిన స్టాల్‌కు రెండో బహుమతి, ఐసీడీఎస్ వారు ఏర్పాటు చేసిన స్టాల్‌కు తృతీయ బహుమతిని అందించారు. ఆయాశాఖలకు చెందిన వారు బహుమతులను అందుకున్నారు. చివరగా జాతీయ గీతాలాపనతో 79వ భారత స్వాతంత్ర్య దిన వేడుకలు ముగించారు.



ప్రథమ బహుమతి పొందిన మున్సిపల్ కార్పొరేషన్ శకటం

అరాచకం రాజ్యమేలుతోంది

- ప్రశ్నించే గొంతులను నొక్కేస్తూ జైళ్లల్లోకి కుక్కేస్తూ..
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూమన కరుణాకరరెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి, పక్కన మేయర్ శిరీష

తిరుపతి మంగళం: స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు అవుతోందని, అయితే రాష్ట్రం స్వాతంత్ర్యం కోల్పోయి ఏడాదిన్నర అవుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూమన కరుణాకరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఖండిస్తూ శుక్రవారం తిరుపతి పద్మావతిపురంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో భూమన కరుణాకరరెడ్డి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజల హక్కులను పూర్తిగా హరించివేస్తోందన్నారు. రాష్ట్రంలోని ప్రజలు వాక్ స్వాతంత్ర్యాన్ని కోల్పోతున్నామని, ప్రశ్నించే పరిస్థితులు లేకుండా పోతున్నాయని, ప్రజాస్వామ్యాన్ని అణచివేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా అరాచకం, అవినీతి రాజ్యమేలుతోందని, ప్రశ్నించే వారిపై నిందారోపణలు మోపి, హింసలకు పాల్పడే వారిగా చిత్రీకరించి, కేసులు బనాయించి జైళ్లల్లోకి కుక్కి ప్రజాస్వామ్యమనేది లేకుండా చేస్తోందని మండిపడ్డారు. ఏడాదిన్నర కిందట జరిగిన ఆంధ్రప్రదేశ్ ఎన్నికలు మొత్తం ఈవీఎంలన్నీ ట్యాపరింగ్ చేశారన్న విషయం దేశమే కోడై కూస్తోందన్నారు. ప్రజాస్వామ్యంగా పరిపాలించి రాష్ట్రంలోని పేదల ప్రజలకు సంక్షేమ రూపంలో రూ. 2.50 లక్షల కోట్లను పేద ప్రజలకు అందించిన గొప్ప నాయకుడైన వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వాన్ని ఎవరు ప్రశ్నించినా వారిని జైళ్లల్లోకి కుక్కే ప్రయత్నాలు నిరంతరం జరుగుతున్నాయన్నారు. ఈ రాష్ట్రంలో హక్కులు లేవు, భావప్రకటన స్వేచ్ఛ లేదు, ప్రశ్నించే మనుషులకు సంకెళ్లు పడుతున్నాయని ఆరోపించారు. ఈ కూటమి అరాచకాలపై ప్రజలంతా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్నామే తప్ప రాష్ట్రంలో మాత్రం స్వాతంత్ర్యం కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో తిరుపతి మేయర్ శిరీష, పార్టీ నగర అధ్యక్షులు మల్లం రవి చంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఉచిత బస్సుకు ఆదరణ కరువు

కేవీబీపురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా శుక్రవారం నుంచి అమలు చేసిన ఉచిత బస్సు పథకానికి ఆదరణ కరువైంది. కనీసం కార్యక్రమం ప్రారంభానికి కూడా మహిళలు బస్సుల దగ్గరకు చేరడం లేదు. కండక్టర్లు గొంతులు పోయేలా ఉచిత బస్సు , ఫ్రీ బస్సు అని అరుస్తున్నా మహిళలు పట్టించుకోవడం లేదు. ఈ ఫొటోలో కనిపిస్తున్న దృశ్యం కేవీబీపురం మండల కేంద్రంలోనిది. ఈ బస్సులో ఉన్నవారు కూడా స్థానికులే అక్కడే ఎక్కించుకుని, పోలీస్ స్టేషన్ దాటి దింపేశారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై మహిళల నుంచి విభిన్న మాటలు వినిపిస్తున్నాయి.



కేవీబీపురంలో ముగ్గురు మహిళలతో నడుస్తున్న బస్సు



అందని జీతం.. అప్పుల జీవనం!

తిరుమల శ్రీవారి సేవా పరివారంలో స్థానం.. టీటీడీ విద్యాసంస్థల్లో ఉద్యోగం.. తాత్కాలిక ప్రాతిపదికనే అయినా అపురూపమైన వరం.. వేలాది మంది పేద విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించే అద్భుత అవకాశం.. దేవదేవుని పాదాల చెంత గురువులుగా విధులు నిర్వర్తించే మహద్భాగ్యం.. అయితే దేవుడు వరమిచ్చినా పూజారి కనికరించని చందంగా తయారైంది కాంట్రాక్ట్ అధ్యాపకుల పరిస్థితి. వేతనం కోసం పడిగాపులు కాయల్సిన దుస్థితి దాపురించింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా మూడు నెలలుగా జీతాలు అందక.. అప్పులు చేసి జీవనం సాగించాల్సి వస్తోంది.

- టీటీడీ విద్యాసంస్థల్లో తాత్కాలిక అధ్యాపకుల ఇక్కట్లు
- 3 నెలలుగా వేతనం కోసం పడిగాపులు
- పట్టించుకోని అధికారులు



ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల

తిరుపతి సిటీ : తిరుపతిలోని టీటీడీ విద్యాసంస్థలలో కాంట్రాక్టు ప్రాతిపదికన కొన్నేళ్లుగా 330 మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులు పనిచేస్తున్నారు. అధికారుల తీరుతో ఉద్యోగ భద్రత దేవుడెరుగు కనీసం జీతాలకు నోచుకోక అలమటిస్తున్నారు. జూన్ నుంచి వేతనాల ఊసేలేక పోవడంతో దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. ఒక వైపు పిల్లల స్కూల్ ఫీజులు చెల్లించలేక, మరో వైపు కుటుంబావసరాలను తీర్చుకోలేక దయనీయస్థితిలో బతుకీడుస్తున్నారు. కొందరు ఈఎంఐలు కట్టలేక అపరాధ రుసుంతో అప్పు చేసి చెల్లిస్తుండగా, మరి కొందరు ఇంట్లోని బంగారు వస్తువులను తాకట్టు పెట్టి జీవనం సాగిస్తున్నారు. జీతాలు ఎప్పుడు జమ చేస్తారో తెలియని అయోమయంలో అధ్యాపకులు నలిగిపోతున్నారు.

పెరుమాళ్లకే ఎరుక!

టీటీడీ ఆధ్వర్యంలో మూడు జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 51మందికి రెన్యువల్ ఉత్తర్వులు అందినా వేతనాలు పడలేదు. డిగ్రీ కళాశాలలోని 161 మంది తాత్కాలిక అధ్యాపకులకు ఇప్పటి వరకు రెన్యువల్ ఉత్తర్వులే అందలేదు. ఈ పరిస్థితుల్లో ఇక జీతాలు ఎప్పుడు వేస్తారో పెరుమాళ్లకే ఎరుకని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే టీటీడీ ఆధ్వర్యంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాల్లో సుమారు 110 మందికి పైగా తాత్కాలిక ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరి పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా కుంగిపోయి మానసికంగా ఒత్తిడికి లోనవుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం

వేతనాల ఫైల్‌ను సంబంధిత అధికారులకు పంపించడంలో కిందిస్థాయి ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు సైతం వేతనాల ఫైల్‌ను తమ వద్దకు తెప్పించుకుని పరిశీలించడంలో మనకేందుకులే... అంటూ అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు మాత్రం ప్రతి నెలా ఒకటో తారీఖున జీతాలను అందుకుంటూ కుటుంబాలను సాఫీగా నడుపుకుంటున్నారు. తాత్కాలిక ఉద్యోగులపై ఎందుకీ వివక్ష అంటూ అధ్యాపకులు మండిపడుతున్నారు. సెప్టెంబర్, అక్టోబర్‌లో అయినా వేతనాలు చేతికందేనా అంటూ ఏడుకొండలవైపు చూస్తున్నారు.

> **కుటుంబాలు గడవడం కష్టంగా ఉంది**
>
> గత మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబాలు గడవడం కష్టంగా ఉంది. నిత్యావసరాలకు సమీపంలోని షాపులలో అప్పులు పెడుతున్నాం. జీతాలు జమ కాకపోవడంతో చేతిలో చిల్లిగవ్వ లేకుండా పండుగలు, ఫంక్షన్లకు దూరంగా ఉంటున్నామంటే అతిశయోక్తి కాదు. పిల్లల స్కూల్ ఫీజులు, ఈఎమ్ఐలు కట్టేందుకు అవస్థలు పడుతున్నాం. టీటీడీ అధికారులు మా దయనీయ స్థితిని అర్థం చేసుకుని త్వరగా వేతనాలు అందించాలని వేడుకుంటున్నాం.
>
> – టీటీడీ విద్యాసంస్థల్లోని తాత్కాలిక అధ్యాపకులు

క్లుప్తంగా

ఏడాదిలోనే 99 శాతం సూపర్ సిక్స్ హామీలు పూర్తి



తిరుపతి బస్టాండ్‌లో ఉచిత బస్సు స్కీమ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి

తిరుపతి అర్బన్: అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే కూటమి సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను 99 శాతం అమలు చేసిందని దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన తిరుపతి బస్టాండ్ వద్ద స్త్రీశక్తి పథకంలో భాగంగా ఉచిత బస్సు జిల్లా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మొదటి టికెట్‌ను తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్యకు కండక్టర్ నుంచి ఇప్పించారు. ఆ తర్వాత రెండో టికెట్ కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా మరో మహిళకు అందించారు. స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తోపాటు తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి పలువురు పార్టీ నేతలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రఘు, ఆర్టీసీ డీపీటీఓ జగదీష్, డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, డిప్యూటీ మెకానిక్ ఇంజినీర్ బాలాజీ తదితరులు తదితరులు పాల్గొన్నారు.

వివాహ పరిచయ వేదిక రేపు

తిరుపతి కల్చరల్: రాయల్ బలిజ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీ ఉదయం 8 గంటలకు గాంధీరోడ్డులోని ఏజీకే బిల్డింగ్‌లో పద్మావతి వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు సుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బలిజ కులానికి చెందిన అమ్మాయిలు, అబ్బాయిలు వారి తల్లిదండ్రులు పాల్గొని, తమ పిల్లలకు తగిన సంబంధాలను కుదుర్చుకునేందుకు ఈ వివాహ పరిచయ వేదిక చక్కటి వేదికగా దోహదపడుతుందని తెలిపారు. ఇందులో పాల్గొనే వారి తల్లిదండ్రులు పెళ్లి కుమారుడు, కుమార్తె పోస్ట్ కార్డు సైజు ఫొటోలు, బయోడేటాను తీసుకుని రావాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన బలిజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8712233082లో సంప్రదించాలని తెలిపారు. ఈ సమావేశంలో బలిజ సంఘ నేతలు గుట్టా నాగరాజ రాయల్, సుబ్బరామయ్య, ఏవీ.ప్రతాప్, మనోజ్, దిలీప్, సాయిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మూడు హోటళ్లు సీజ్

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలో స్వాతంత్ర్య దినోత్సవ నిబంధనలు ఉల్లంఘించి మాంసాహార భోజనాలు విక్రయిస్తున్న హోటల్‌ను అధికారులు సీజ్ చేశారు. శుక్రవారం నగరంలోని పలమనేర్ రోడ్డు లోని హోటల్ తో పాటు మరో రెండు హోటళ్లలో మాంసాహారం విక్రయిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్‌కు ఫిర్యాదులు అందాయి. కమిషనర్ ఆదేశాలతో ప్రజారోగ్య శాఖ అధికారులు నగరంలోని మూడు హోటళ్లను సీజ్ చేశారు.

మూగబోయిన ఆటల గంట!

విశ్వవేదికలపై మన క్రీడాకారులు గెలిచిన వేళ..పిడికిలి బిగించి విజయ చిహ్నంగా మన జాతీయజెండా ఎగురవేసిన వేళ.. మన క్రీడాకారులను చూసిన సమయంలో నా బిడ్డా అంతటిస్థాయికి ఎదగాలని తల్లిదండ్రులు.. నేనూ అలాంటి స్థాయికి చేరుకోవాలని విద్యార్థులు కలలు కంటారు. ఆ దిశగా అడుగులు పడాలంటే నిరంతర క్రీడా సాధన అవసరం. అందుకు కాలు మోపే మైదానాలుండాలి. క్రీడా పునాదికి పాఠశాలల్లో తప్పనిసరిగా ఆట స్థలాలు ఉండాలి. జిల్లాలో పరిస్థితి భిన్నంగా ఉంది. బాల్యం తరగతి గదిలో బందీ అవుతున్నా.. పాలకులు, అధికారులు మిన్నకుంటున్నారు.

- కనిపించని మైదానాలు
- క్రీడలకు విద్యార్థులు దూరం
- తరగతిగదిలో బాల్యం బందీ



తిరుపతి సిటీ: నేటితరం విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. విద్యార్థి దశ నుంచే క్రీడలను ప్రోత్సహించాల్సిన పాఠశాలలు ఆ ఊసే ఎత్తడం లేదు. ప్రైవేటు పాఠశాలల్లో, కళాశాలలోనూ క్రీడా మైదానాలే కానరావడం లేదు. ఆ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు గల్లీ క్రికెట్ తప్ప తమకు ఏ క్రీడలు తెలియవని చెబుతుండడం ఆశ్చర్యకరం. జిల్లాలో అధికారులకు ముడుపులు చెల్లించి మౌలిక వసతులు లేకపోయినా ధనార్జనే ధ్యేయంగా అధికార, ధన బలంతో ఇప్పుడిముబ్బడిగా వీధికి ఒక ప్రైవేటు పాఠశాలు ఏర్పాటు చేసుకున్నారు. నిబంధనలను తుంగలో తొక్కి ఒక్కొక్క పాఠశాలలకు అనుమతులు లేకపోయినా రెండు, మూడు బ్రాంచ్‌లను నడుపుతూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటూ రూ.కోట్లు కూడబెట్టుకుంటున్నారు. ప్రైవేటు విద్యాసంస్థలో చదివే విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో అధిక సంఖ్యలో పాల్గొనకపోవడంపై ఓ ప్రైవేటు సంస్థ చేసిన సర్వేలో పలు కీలక అంశాలు తెరపైకి వచ్చాయి.

భవనాలు.. అపార్ట్‌మెంట్లలో విద్యాసంస్థలు

జిల్లాలోని సుమారు 90 శాతం ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలలో కనీస వసతులు లేవు. ఆట స్థలాలు ఊసే లేదు. కుటుంబాలు అద్దెకు ఉండే భవనాలు, అపార్ట్‌మెంట్లలో విద్యాసంస్థలను నడుపుతూ రూ.కోట్లు వెనకేసుకుంటున్నారు. విద్యార్థులను క్రీడల వైపు ప్రోత్సహించే ప్రక్రియ ఖర్చుతో కూడుకున్న వ్యవహారంగా భావించి, అధికారులతో యాజమాన్యాలు చేతులు కలిపి అనుమతులు పొందుతున్నారు.

తిరుపతి జిల్లా సమాచారం	
ప్రైవేటు పాఠశాలలు	- 689
క్రీడా మైదానాల లేని పాఠశాలలు	- 667
పీఈటీలు లేని పాఠశాలలు	- 675
ప్లేగ్రౌండ్లు ఉన్న పాఠశాలలు	- 22
ప్లేగ్రౌండ్స్ ఉన్నా క్రీడలను ప్రోత్సహించనివి	- 12
టైంటేబుల్‌లో క్రీడల పీరియడ్ లేని పాఠశాలలు	- 595
జిల్లాలో ప్రైవేటు కళాశాలల వివరాలు	
ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు	- 119
ప్లే గ్రౌండ్స్ లేని కళాశాలలు	- 101
ఫిజికల్ డైరెక్టర్ల లేని కళాశాలలు	- 97

క్రీడా మైదానం లేకపోయినా యాజమాన్యాలు అధికారుల చేయితడిపి అన్ని సౌకర్యాలున్నట్లు అనుమతులు పొంది పక్కా రికార్డులు తయారు చేసుకుని తమ పని కానిచ్చేస్తున్నారు. అడిగే నాథుడు లేకపోవడంతో ప్రైవేటు యాజయాన్యాలు ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తున్నాయి.

పీఈటీలు, పీడీల నియామకాలు నిల్

ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో మైదానాల మాట దేవుడెరుగు. కనీసం పీఈటీ, ఫిజికల్ డైరెక్టర్ పోస్టుల నియామకాల ఊసే లేదు. 10 శాతం పాఠశాలల్లో పీఈటీలున్నా తగిన అర్హతలు, సమర్థులైన వ్యాయామ ఉపాధ్యాయులు ఉండడం లేదు. ఇంటర్, డిగ్రీ చదివిన వారిని నియమించుకుని కాలం వెళ్లదీస్తున్నారు. అలాగే మరికొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు పీడీ పోస్టు నియామకం జరిపినట్లు ఇతరుల ఫేక్ ధ్రువపత్రాలతో అనుమతులు పొందిన విద్యాసంస్థలు కోకొల్లలు. అధికారులకు రూ.లక్షలలో ముడుపులు చెల్లించి, విద్యార్థుల భవిష్యత్తును సర్వనాశనం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో మాత్రమే కాస్తో కూస్తో మైదానాలు, పీఈటీలు ఉన్నారు. దీంతో అడపదడపా జిల్లా స్థాయికి పాఠశాలల నుంచి కొందరు ఎంపిక అవుతున్నారు.

స్వతహాగా తల్లిదండ్రులే శిక్షణ ఇప్పిస్తున్నారు

ప్రైవేటు విద్యాసంస్థల్లో చదివే పిల్లలకు క్రీడలపై ఆసక్తి ఉన్నా యాజమాన్యాలు అవకాశం ఇవ్వకపోవడంతో తల్లిదండ్రులు స్వతహాగా ప్రైవేటు కోచింగ్ సెంటర్ల ద్వారా శిక్షణ ఇప్పిస్తున్నారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించాలనే ఉద్దేశంతో పిల్లలకు ఆసక్తి ఉన్న క్రీడలను ఎంపిక చేసుకుని, నెలకు రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు ప్రవేశాల సమయంలో ఏవేవో కథలు చెప్పి జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో పిల్లలకు శిక్షణ ఇస్తామని ప్రగల్భాలు పలికి రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేసి, ఆ తర్వాత కనీసం పట్టించుకున్న పాపాన పోలేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తామే ఉదయం, సాయంత్రం ప్రైవేటు కోచింగ్ సెంటర్లకు తీసుకెళ్లి శిక్షణ ఇప్పిస్తున్నామని చెబుతున్నారు.

అధికారుల ఉదాశీనతతోనే..



విద్యాశాఖాధికారులు పట్టించుకోకపోవడంతోనే ప్రైవేటు విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. అధికారులకు ముడుపులు చెల్లించి క్రీడా మైదానాలున్నట్లు అనుమతులు పొందుతున్నాయి. మా అబ్బాయి ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. ఆతడి రోజువారీ టైంటేబుల్ చూస్తే పీఈటీ కోసం పీరియడ్ ఉండదు. ఎందుకంటే ఆ పాఠశాలల్లో పీఈటీ లేరు. పిల్లలకు వ్యాయమం తగ్గి, అనారోగ్యం పాలు కావడానికి ఇదో కారణం.

–స్వర్ణలత, విద్యార్థిని తల్లి, తిరుపతి

సొంతంగా కోచింగ్ ఇప్పిస్తున్నాం



మా అమ్మాయి నగరంలోని ఓ పేరొందిన ప్రైవేటు విద్యాసంస్థలో ఆరో తరగతి చదువుతోంది. క్రీడల ఊసే ఉండదు. కానీ మా అమ్మాయికి బ్యాడ్మింటన్‌పై ఆసక్తి ఉండడంతో నగరంలోని ఓ ప్రైవేట్ కోచ్ వద్ద నెలకు రూ. 6 వేలు చెల్లించి సొంతంగా కోచింగ్ ఇప్పిస్తున్నాం. ఇప్పటివరకు నాకు తెలిసి తిరుపతి జిల్లాలోని ఒక ప్రైవేటు పాఠశాలలోనూ క్రీడలను ప్రోత్సహించే యాజమాన్యాలు లేవు. ఇది మరి దారుణం.

–పద్మావతి, విద్యార్థిని తల్లి, తిరుపతి

త్వరలో యాజమాన్యాలతో చర్చిస్తాం



జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న పిల్లలను యాజమాన్యాలు క్రీడల వైపు ప్రోత్సహించాలి. ప్రతి పాఠశాలకు ప్రత్యేక క్రీడా మైదానం తప్పకుండా ఉండాల్సిందే. అందులోనూ అర్హులైన పీఈటీలను నియమించుకోవాలి. నిబంధనలు అతిక్రమించిన పాఠశాలలపై చర్యలు తీసుకుంటాం. త్వరలో అన్ని ప్రైవేటు యాజమాన్యాలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, క్రీడల ప్రాధాన్యతను తెలియజేస్తాం.

–కేవీఎస్ కుమార్, డీఈఓ, తిరుపతి జిల్లా

ప్రతి కళాశాలకూ ఆట స్థలం ఉండాల్సిందే!



జిల్లాలోని అన్ని ప్రైవేటు కళాశాలలో క్రీడా మైదనాలు ఉండాల్సిందే. లేని పక్షంలో చర్యలు తప్పవు. అలాగే ప్రతి కళాశాలలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఫిజికల్ డైరెక్టర్ల నియామకం జరపాలి. అందులోనూ సమర్థులైన పూర్తి స్థాయి అర్హతగలిగిన అభ్యర్థులనే ఎంపిక చేయాలి. ప్రతి రోజూ క్రీడలకు సంబంధించి ప్రత్యేక పీరియడ్‌ను టైంటేబుల్‌లో ఉంచి తీరాలి.

–రాజశేఖర్‌రెడ్డి, ఆర్‌ఐఓ, తిరుపతి



ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న (కుడి నుండి ఎడమకు) తిరుపతి కమిషనర్ నారపురెడ్డి మౌర్య, ప్రసాద్‌రావు,ఏజీ, జేడీ, నరసింహులు, డీఆర్వో, సుశీలాదేవి, డీపీఓ, విక్రమకుమార్‌రెడ్డి, డీడీ, కేవీఎస్ కుమార్, డీఈఓ, శ్రీనివాస ప్రసాద్, డ్వామా పీడీ

ఉత్తమ సేవకు పురస్కారం

తిరుపతి అర్బన్: తమ విభాగాల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రశంసాపత్రాలను తారకరామా స్టేడియంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డితోపాటు కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జేసీ శుభం బన్సల్ చేతుల మీదుగా అందుకున్నారు. జిల్లాలో 391 మందికి ఉత్తమ సేవలకు అవార్డులు అందజేశారు.



(ఎడమనుండి కుడికి) సుజన, ఎస్‌డీసీ, దశరథరామిరెడ్డి, ఉద్యానశాఖ జేడీ, మాధవి, గైనకాలజిస్ట్, వెటర్నరీ ఆసుపత్రి, వసంతబాయి, ఐసీడీఎస్ పీడీ, శోభన్‌బాబు, డీఆర్‌డీఏ పీడీ, లోకనాథం, సిల్క్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి, దీప,యూనివర్సిటీల స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి, భానుప్రకాష్‌రెడ్డి, ఆర్డీఓ శ్రీకాళహస్తి



(ఎడమనుండి కుడికి) రమణప్రసాద్, టూరిజం అధికారి, రమేష్‌బాబు, కలెక్టరేట్ ఏఓ, ఈశ్వరమ్మ, సమాచారశాఖ అధికారి, సుదర్శన్‌రెడ్డి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, ఏఎస్‌ఐ భాస్కర్, రామకిశోర్, అలిపిరి సీఐ, రెడ్డి నాగార్జున, డిప్యూటీ తహశీల్దార్, రమణారెడ్డి, టీటీడీ ఉద్యోగి

హరోంహర నామ స్మరణతో మార్మోగిన రామగిరి

- వేడుకగా తెప్పోత్సవాలు ప్రారంభం
- భరణి, బారీగా విచ్చేసిన భక్తులు



తెప్పపై విహరిస్తున్న శ్రీవల్లి దేవసేన సమేత ముత్తుకుమారస్వామి

నాగలాపురం : ఆడికృత్తిక పర్వదినాన్ని పురస్కరించుకుని పిచ్చాటూరు మండలం రామగిరి సుబ్రమణ్యస్వామి ఆలయ ప్రాంగణం హరోంహర నామస్మరణలతో మారుమోగింది. శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో భరణి తెప్పోత్సవాలు శుక్రవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. స్వామివారి మూలవర్లకు అర్చకులు భరణి అభిషేకం చేసి, వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని పుష్కరణిలో కావళ్లు చెల్లించి, స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం శ్రీ వళ్లి,దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అభిషేకం చేసి, విశేషాలంకరణ చేసి తిరుచ్చిపై కొలువుదీర్చారు. స్వామి అమ్మవార్లను ఆలయం నుంచి ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు వేంచేపు చేసి, తెప్పోత్సవం నిర్వహించారు. ఈ తెప్పోత్సవాన్ని తిలకించిన భక్తజనం రాత్రంతా ఆలయ ప్రాంగణలో జాగారం చేశారు. భక్తుల కాలక్షేపం కోసం భక్త మార్కండేయ హరికథగానం చేశారు. భరణి అభిషేక ఉభయదారులుగా పళ్లికొండేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఆలయ ఈఓ ముత్తం శెట్టి రామచంద్రరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పుత్తూరు డీఎస్పీ రవి కుమార్ పర్యవేక్షణలో ఇద్దరు సీఐలు, ఆరుగురు ఎస్ఐలు, కానిస్టేబుళ్లతో కలిపి మొత్తం 130 మంది పోలీసు బందోబస్తులో పాల్గొన్నట్లు పిచ్చాటూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

నేటి నుంచి రాజనాలబండ జాతర

చౌడేపల్లె : సత్య ప్రమాణాలకు నిలయమైన రాజనాలబండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ,శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం వద్ద నేటి నుంచి రెండు రోజులపాటు వైభవంగా జాతర జరగనుంది. టీటీడీ ఆధ్వర్యంలో సంప్రదాయ రీతిలో తిరుణాల జరగనుందన్నారు. ఏటా పూర్వీకుల నుంచి శ్రావణమాస చివరి శనివారం రోజున రాజనాలబండపై వెలసిన స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటు పక్కనే ఉన్న ఎత్తైన శ్రీలక్ష్మీనరసింహస్వామి కొండపై భక్తులు తరలివెళ్లి పూజలు చేయడం ఆనవాయితీ. అదే రోజు రాత్రి కొండపై గల రాతి స్తంభంపై దీపం వెలిగించి అఖండ దీపారాధన చేస్తారు. స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను గ్రామాల్లో ఊరేగింపు చేపడుతారు.



ఎమ్మెల్సీ మేరిగకు పరామర్శ



మేరిగ ఆనందరావుకు నివాళులర్పిస్తున్న నారాయణస్వామి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కాకాణి పూజిత



ఆనందరావుకు నివాళులర్పించేందుకు వచ్చిన నేదురుమల్లి, కిలివేటి, ఎల్లసిరి తదితరులు

రాపూరు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్‌ను పలువురు పరామర్శించారు. మురళీధర్ తండ్రి మేరిగ ఆనందరావు (89) గురువారం మృతి చెందిన విషయం తెలిసిందే. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆనందరావు చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాపూరులోని లక్ష్మీపురంలోని ఆయన నివాసంలో ఆనందరావు భౌతిక కాయాన్ని సందర్శించిన పలువురు నాయకులు మేరిగ మురళీధర్‌ను పలకరించి, సంతాపం తెలిపారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జోన్–4 వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజితమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తిన పట్టాభిరామిరెడ్డి, పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, మండల కన్వీనర్ బోడ్డు మధుసూదన్‌రెడ్డి, దందోలు నారాయణరెడ్డి, మస్తాన్ యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి తదితరులు శుక్రవారం ఆనందరావు భౌతిక కాయానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం మేరిగ మురళీధర్‌ను పరామర్శించి, తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

అదుపుతప్పి లారీ బోల్తా

నాయుడుపేటటౌన్: మండలంలోని తన్నమాల సమీపంలో రహదారిపై శుక్రవారం ధాన్యం లోడ్‌తో వెళుతున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. స్థానికుల కథనం మేరకు.. తన్నమాల గ్రామ పరిసర ప్రాంతాల్లో ధాన్యం సేకరించుకుని బస్తాలు నింపుకున్న లారీ నాయుడుపేటకు బయలు దేరింది. తన్నమాల సమీపంలో ఓ మలుపు వద్ద వేగంగా వస్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. లారీ డ్రైవర్ మద్యం సేవించి ఉండడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. లారీ డ్రైవర్ అక్కడ నుంచి పరారయ్యాడు .ధాన్యం బస్తాలను మరో వాహనంలో తరలించారు.



బోల్తా పడిన ధాన్యం లారీ

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్ : ఉపాధ్యాయ దినోత్సవంను పురస్కరించుకుని జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ వరలక్ష్మి వెల్లడించారు. శుక్రవారం డీఈఓ విలేకరులతో మాట్లాడారు. 2025వ సంవత్సరం ఉపాధ్యాయ దినోత్సవం రోజున జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవార్డులకు జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పరిధిలో విధులు నిర్వహిస్తున్న టీచర్లు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 10 సంవత్సరాల సర్వీసు ఉన్న హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు జిల్లా స్థాయి అవార్డులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న టీచర్లు తమ ప్రతిపాదనల దరఖాస్తులు రెండు కాపీలు ఈ నెల 20వ తేదీలోపు సంబంధిత డీవైఈవో కార్యాలయాల్లో అందజేయాలన్నారు. గడువు తర్వాత వచ్చే దరఖాస్తుల ప్రతిపాదనలు స్వీకరించబడవని డీఈవో వెల్లడించారు.